క్లుప్తంగా

పిల్లలు నీతి కథలు నేర్చుకోవాలి



గ్రంథాలయంలో నీతి కథలు నేర్చుకుంటున్న విద్యార్థులు

పెద్దాపురం: విద్యార్థులు పిన్న వయసు నుంచే నీతి కథలపై మంచి పరిజ్ఞానం కలిగి ఉండాలని శాఖా గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించే వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా గురువారం తెలుగు పద్యాలు, నీతి కథలు, పుస్తక సమీక్ష వంటి అంశాలపై వాట్సాప్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు మాట్లాడుతూ గ్రంథాలయంలో అందిస్తున్న పుస్తకాలను చదివి విద్యార్థులు గ్రంథాలయ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది సింగం బుల్లియ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి కనకాల రాజీనామా



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కనకాల దంపతులు

పెద్దాపురం: పట్టణ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కనకాల మహాలక్ష్మి, మహారాణి సత్రం మాజీ చైర్మన్ కనకాల సుబ్రహ్మణ్యేశ్వరరావు దంపతులు గురువారం వైఎస్సార్ సీపీకి రాజీనామా చేశారు. వారి స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ అనారోగ్యం, ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో పార్టీకి రాజీనామా చేస్తున్నామన్నారు. వార్డు ప్రజల సమస్యల పరిష్కారానికై వైస్ చైర్మన్ పదవిలో కొనసాగుతానని మహాలక్ష్మి ప్రకటించారు. పార్టీలో అధిష్టానం మమ్మల్ని గుర్తించి వైస్ చైర్మన్ పదవి కట్టబెట్టిందని, స్థానికంగా ఉన్న ఇబ్బందుల నేపథ్యంలోనే పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు సుబ్రహ్మణ్యేశ్వరరావు ప్రకటించారు.

వేసవి దుక్కులతో పంటకు మేలు



జగ్గంపేటలో వేసవి దుక్కులు చేస్తున్న రైతు

జగ్గంపేట: రుతు పవనాలు వచ్చే సమయం ఆసన్నమైనందున రైతులు వేసవి దుక్కులు వేగవంతం చేయాలని జగ్గంపేట మండల వ్యవసాయాధికారి రెడ్ల శ్రీరామ్ తెలిపారు. వేసవి దుక్కుల వల్ల పంటలకు మేలు జరుగుతుందన్నారు. భూమికి తేమను నిలుపుకొనే శక్తి పెరుగుతుందని, గట్టి పొరలు విడిపోయి భూమి గుల్లగా మారుతుందని వివరించారు. సూక్ష్మజీవులు, వానపాములు వృద్ధి చెంది, సేంద్రియ పదార్థాలు పెరుగుతాయని, కలుపు మొక్కలు నశించి, భూమి సారవంతమవుతుందని చెప్పారు. దీనివల్ల ఎరువులు, పురుగు మందుల ఖర్చు తగ్గుతుందన్నారు. పంటలకు ఆశించే పురుగులు వేసవిలో నిద్రావస్థలో ఉంటాయని, వేసవి దుక్కుల కారణంగా అవి బయట పడతాయని తెలిపారు. వీటిని పక్షులు ఆహారంగా స్వీకరించడం, మరికొన్ని ఎండవేడికి మరణించడం వల్ల పంటలకు నష్టం తప్పుతుందని తెలిపారు. గత పంటకు సంబంధించిన మొక్కల వేర్లు భూమి పొరల్లో ఎరువుగా మారతాయన్నారు. ఎలుకల బెడద తగ్గుతుందని చెప్పారు. దుక్కులు పూర్తయ్యాక వర్షాలు ప్రారంభం కాగానే పంట వేసుకోవచ్చని వ్యవసాయాధికారి శ్రీరామ్ తెలిపారు.

తలుపులమ్మ తల్లికి రూ.35.23 లక్షల ఆదాయం

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారికి హుండీల ద్వారా రూ.35,22,980 ఆదాయం లభించిందని ఇన్‌చార్జి డిప్యూటీ కమీషనర్, లోవ దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈఓ) పె న్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. దేవదాయ శా ఖ జిల్లా అధికారి పులి నారాయణమూర్తి, గ్రేడ్–2 ఈఓ జె.సత్యనారాయణ, దేవదాయ శాఖ పెద్దాపురం తనిఖీదారు వి.సురేష్ పర్యవేక్షణలో దేవస్థానంలోని హుండీలను గురువారం తెరచి ఆదాయం లెక్కించారు. భక్తులు హుండీల ద్వారా 42 రోజులకు సమర్పించిన మొత్తాన్ని లెక్కించామని ఈఓ విశ్వనాథరాజు తెలిపారు. నాణేల రూపంలో రూ.1,26,745, నోట్లు రూ.33,96,235 వచ్చాయన్నారు. లెక్కింపులో బ్యాంకు అధికారులు, శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.

తొలకరి కాలం.. వ్యాధుల గాలం

- పశువులకు పొంచి ఉన్న ముప్పు
- గాలికుంటు, గొంతువాపు వ్యాధుల వ్యాప్తి
- ముందస్తు టీకాలు వేయించాలంటున్న పశు వైద్యులు



పశువులకు వ్యాక్సిన్ వేస్తున్న పశు వైద్య సిబ్బంది

గొల్లప్రోలు: వర్షాకాలం వస్తుందంటే రైతుల్లో ఆందోళన, గుబులు పుట్టుకొస్తుంది. ప్రస్తుతం తొలకరి వానలు కురుస్తుండంతో పశువులకు సోకే వ్యాధులపై పాడి రైతులు ఆందోళన చెందుతున్నారు. పిఠాపురం నియోజకవర్గంలో రైతులు వ్యవసాయంతో పాటు, పాడి పరిశ్రమకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. పంట సాగులో నష్టం వచ్చినా, కరువు కమ్ముకొచ్చినా కలిగే లోటును పాడి పరిశ్రమతో పూడ్చుకొని జీవనం సాగిస్తున్నారు. అలాంటి కీలకాధారమైన పశువులకు వర్షాకాలంలో సోకే వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యులు హెచ్చరిస్తున్నారు.

ఈ వర్షాకాలంలో పశువులకు గొంతు వాపు, జబ్బ వాపు, చిటుక వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. ఇవి జూన్ నుంచి సెప్టెంబర్ వరకు తొలకరి సమయంలోనే అధికంగా వ్యాప్తి చెందుతుంటాయి. ఈ వ్యాధులు సోకితే పాల దిగుబడి తగ్గడంతో పాటు, పశువులు మరణించే ప్రమాదమూ ఉంది. దీంతో పాడి రైతులు నష్టపోవాల్సిన పరిస్థితి ఉంటుంది. వర్షాకాలంలో కలుషితమైన నీరు, మేత కారణంగా పశువులకు రోగ నిరోధక శక్తి తగ్గి, పలు వ్యాధులు సంక్రమిస్తుంటాయి. పశువులకు సోకే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. గొల్లప్రోలు మండలం, పట్టణంలో గేదెలు 14,043, ఆవులు 2,212, మేకలు 6,478, గొర్రెలు 7,919 వరకు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పశువులకు సోకే వ్యాధుల నివారణకు పశు వైద్యాధికారులు పాడి రైతులకు అనేక సూచనలు, సలహాలు ఇస్తున్నారు.

టీకాలు తప్పనిసరి

పశువులకు వర్షాకాలంలో సోకే వ్యాధుల నివారణకు ముందస్తుగా టీకాలు తప్పనిసరిగా వేయించాలి. కొందరు రైతులు పాల దిగుబడి తగ్గిపోతుందని టీకాలు వేయించడానికి వెనకడుగు వేస్తారు. టీకాలు వేయడంతో పాల దిగుబడి తగ్గిపోతుందనేది ఓ అపోహ మాత్రమే. అలాంటిదేమీ జరగదని పశు వైద్యులు చెబుతున్నారు. వ్యాధులు ముదిరి పశువులను కోల్పోవడం కన్నా, ముందస్తు టీకాలు వేయిస్తే వ్యాధులు సోకకుండా నివారించవచ్చని వైద్యులు చెబుతున్నారు.

గొంతు వాపు అంటు వ్యాధే..

వర్షాకాలంలో పశువులకు ప్రధానంగా గొంతు వాపు వ్యాధి సోకుతుంది. దీనినే గురక వ్యాధి అని కూడా అంటారు. వర్షాకాలంలో గేదెలు, ఆవులు ముఖ్యంగా దూడల్లో ఎక్కువగా ఈ వ్యాధి వ్యాపిస్తుంది. ఒక్కోసారి గొర్రెలు. మేకలు, పందుల్లో కూడా వ్యాపిస్తుంటుంది. ఇది అంటు వ్యాధి. కంటి నుంచి నీరు, నోటి నుంచి సురగ కారుతూ, గురక, శ్వాస పీల్చడం కష్టమవుతుంది. జ్వర తీవ్రత 106, 107 డిగ్రీల వరకు ఉంటుంది. గొంతు కిందకు నీరు దిగి, గొంతు వాపు వస్తుంది. ఈ వ్యాధి వచ్చిన 24 గంటల్లో పశువులు మరణించే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

ముందస్తు టీకాలు వేయించాలి



ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పశువులకు సోకే వ్యాధులపై అప్రమత్తంగా వ్యవహరించాలి. ముందస్తు టీకాలు వేయిస్తే మంచి ఫలితం ఉంటుంది. అలాగే జాగ్రత్తలు పాటించడంలోనూ వ్యాధుల నివారణకు అవకాశం ఉంది.

– డాక్టర్ ప్రశాంత్, మండల పశు వైద్యాధికారి, గొల్లప్రోలు

నివారణ చర్యలు ఇవీ..

వర్షాకాలానికి ముందే జూన్, జూలై నెలల్లో వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలి. వ్యాధి సోకిన పశువుల దొడ్డిని ఫినాయిల్, క్రిసాల్ వంటి క్రిమి సంహారక ద్రావణంతో పరిశుభ్రం చేయాలి. వ్యాధి లక్షణాలు కనిపించిన పశువును వెంటనే మందనుంచి వేరు చేయాలి. తప్పనిసరిగా పశు వైద్యాధికారిని సంప్రదించి, వైద్యం చేయించాలి.

గాలికుంటుతో తీవ్ర జ్వరం

కలుషితమైన గాలి ద్వారా ఈ వ్యాధి సోకుతుంది. తల్లి పాల ద్వారా దూడలకు సోకే అవకాశం ఉంటుంది. ఏటా వర్షకాలంలో గేదెలు, ఆవులకు వచ్చే వ్యాధుల్లో గాలికుంటు ఒకటి. గిట్టలు ఉన్న ప్రతి జీవికి ఈ వ్యాధి సోకుతుంది. వ్యాధి సోకిన సమయంలో పశువులకు 104 నుంచి 105 డిగ్రీల జ్వరం వస్తుంది. నోటిలో, గిట్టల మధ్య పుండ్లు వచ్చి పశువులు నడవలేని స్థితికి చేరుకుంటాయి. వ్యాధి సోకిన పశువులు మేత తీసుకోలేక, నీరసిస్తాయి.

నివారణ చర్యలు

వ్యాధి సోకిన పశువులను మంద నుంచి వేరు చేయాలి. నోటిలోని పుండ్లకు బోరిక్ పౌడర్, గ్లిజరిన్ కలిపి పూయాలి. గిట్టల మధ్య పుండ్లకు మందు ద్రావణంతో శుభ్రం చేసి వేపనూనె రాయాలి. యాంటీ బయోటిక్స్ వాడితే ఉపశమనం కలుగుతుంది.

ముగిసిన భక్తాంజనేయుని వార్షికోత్సవాలు



విశేషాలంకరణలో భక్తాంజనేయ స్వామి

గొల్లప్రోలు: మండలంలోని చేబ్రోలు గ్రామంలో ఘనంగా భక్తాంజనేయ స్వామి వార్షికోత్సవాలు నిర్వహించారు. హనుమత్ జయంతిని పురస్కరించుకుని చేబ్రోలు ఈబీసీ కాలనీలోని ఆంజనేయ స్వామి గుడి వద్ద జరుగుతున్న వార్షికోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆంజనేయస్వామికి విఘ్నేశ్వర పూజ, లక్ష్మీగణపతి హోమం, తమలపాకులు, సింధూరంతో పూజలు నిర్వహించారు. అనంతరం భజన కార్యక్రమాలు జరిగాయి. ఆలయ కమిటీ భక్తుల సహకారంతో భారీ అన్న సమారాధన జరిగింది. పరిసర గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి, అన్న ప్రసాదాలను స్వీకరించారు.

బకాయిదారులకు నోటీసులు

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలో బకాయి ఉన్న దుకాణదారులకు మున్సిపల్ రెవెన్యూ అధికారులు నోటీసు జారీ చేశారు. ఆయా సెంటర్ల మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఉన్న దుకాణాల అద్దెలు బకాయిలు ఎక్కువగా ఉండడంతో నోటీసులు ఇచ్చారు.

ఎర్ర తురాయి.. మదిని దోచెనోయ్..



ఉప్పాడ-పిఠాపురం రోడ్డులో విరబూసిన పుష్పాలు

కొత్తపల్లి: వసంత కాలంలో వివిధ రకాల చెట్లు నూతన చిగుర్లు, పుష్పాలతో కొత్త శోభను సంతరించుకుంటాయి. ఉప్పాడ-పిఠాపురం, కొత్త ఇసుకపల్లి-పాత ఇసుకపల్లి, నాగులాపల్లి-మూలపేట రోడ్లలో ప్రకృతి అందాలు కనువిందు చేస్తున్నాయి. రోడ్డుకు ఇరువైపులా విరబూసిన ఎర్ర తురాయి పూలు వాహన చోదకుల మనస్సులను దోచుకుంటున్నాయి. పచ్చటి లేత ఆకులు, ఎర్రని పూలతో ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి. మండు వేసవిలో ఆకులు రాలి, నిస్తేజంగా కనిపించిన ఈ చెట్లు ప్రస్తుతం పూలు విరబూసి కనువిందు చేస్తున్నాయి.

ప్రజా తీర్పును గౌరవిస్తాం

- ఎమ్మెల్యే పవన్ కల్యాణ్‌కు శుభాకాంక్షలు
- వైఎస్సార్ సీపీ పిఠాపురం అభ్యర్థి వంగా గీత



తనను కలిసిన నాయకులతో వంగా గీత

పిఠాపురం: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును తాము గౌరవిస్తామని, సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నట్టు వైఎస్సార్ సీపీ పిఠాపురం అభ్యర్థి వంగా గీత తెలిపారు. ఎమ్మెల్యేగా గెలిచిన జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. ఆమె గురువారం పిఠాపురంలో తన కార్యాలయంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని, పిఠాపురం నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీ చేసిన సందర్భంగా పిఠాపురం ప్రజలందరూ పూర్తి సహకారం అందించారన్నారు. తన వెన్నంటి నిలిచిన వైఎస్సార్ సీపీ నాయకులకు, కార్యకర్తలకు స్థానిక సంస్థల ప్రతినిధులకు, సంస్థాగత కమిటీల నాయకులకు, పెద్దలకు, మహిళలకు, యువకులకు, ముఖ్యంగా వైఎస్సార్ సీపీకి ఓట్లు వేసిన ఓటర్లకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల ప్రచారంలో పిఠాపురం ప్రజలు అందించిన సహకారం జీవితంలో మరువలేనని, ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి తన పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు. ప్రజలకు ఏ అవసరం వచ్చినా తాను అందుబాటులో ఉంటానన్నారు. కార్యకర్తలకూ అందుబాటులో ఉండి, వారికి అండగా ఉంటానన్నారు. ప్రతిపక్ష పాత్ర పోషించడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు.

సమర్థంగా ఎన్నికల నిర్వహణ

- సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు
- ఈఆర్వో జేఎస్ రామారావు



మాట్లాడుతున్న ఆర్వో రామారావు

పెద్దాపురం: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలు ఎన్నికల నియమావళి పాటిస్తూ సిబ్బంది అంతా నిబద్ధతో పనిచేయడంతో ఎన్నికలను సమర్థంగా నిర్వహించామని పెద్దాపురం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ జేఎస్ రామారావు అన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు సహకరించిన రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల ఎన్నికల సిబ్బంది, ఓటు హక్కు వినియోగించుకున్న ప్రతి ఓటరుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల కోడ్ ప్రకటించిన నాటి నుంచి నామినేషన్ల ప్రక్రియ, పోలింగ్ ప్రక్రియ, కౌంటింగ్ ప్రక్రియను సమష్టి సహకారంతో మరింత సమర్ధవంతంగా నిర్వహించామన్నారు. సిబ్బంది అంతా అంకిత భావం, నిబద్ధతతో విధులు నిర్వహించారని ఆర్‌ఓ అభినందించారు. మొత్తం ప్రక్రియలో ఎటువంటి అంవాఛనీయ సంఘటనలు లేకుండా సమర్ధవంతంగా విధులు నిర్వహించిన పోలీస్ సిబ్బంది, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, సిబ్బందితో పాటు రాజకీయ పక్షాల ప్రతినిధులకు ఆర్డీఓ రామారావు ధన్యవాదాలు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



తుని సరస్వతి శిశు మందిరంలో మొక్కలు నాటుతున్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

తుని: పర్యావరణ పరిరక్షణను అందరూ బాధ్యతగా తీసుకోవాలని స్థానిక వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు డీఎస్ మూర్తి పిలుపునిచ్చారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక శ్రీసరస్వతి శిశు మందిర్‌లో క్లబ్ ప్రతినిధులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఎక్కడికక్కడ చెట్లు తొలగించేస్తుండడం వల్ల ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని వర్గాల ప్రజలు మొక్కలను విరివిగా నాటి, వాటిని సంరక్షించాలని విజ్ఞప్తి చేశారు.

వైభవంగా అమ్మవార్ల జాతర



కొమరగిరిలోని నేరేళ్లమ్మ తల్లి



భక్తుల పూజలందుకుంటున్న పచ్చాలమ్మ తల్లి



జాతరలో అమ్మవారి వెంట వెళ్తున్న భక్తులు



పిఠాపురంలో నేరెళ్లమ్మ తల్లిని దర్శించుకున్న భక్తులు

పెద్దాపురం: మండలంలోని గుడివాడ గ్రామ దేవత పచ్చాలమ్మ తల్లి జాతర గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ కనపర్తి సత్యానందం ఆధ్వర్యంలో ఆలయాన్ని విద్యుత్ దీపాలంకరణ చేయగా వేకువ జాము నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. సర్పంచ్ కనపర్తి నూకరాజు (చీమదొర) దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి కోలాటం, మ్యూజికల్ నైట్, గరగల నృత్యం, డప్పు వాయిద్యాలు, పులి వేషాలు, జాగరణ ఉత్సవం వైభవంగా నిర్వహించారు. కళ్ల మిరిమిట్లు గొలిపేలా బాణసంచా కాల్చారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు. భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అమ్మవారిని భారీగా భక్తులతో పాటు గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో కనపర్తి బాబి, సుబ్రహ్మణ్యం, శ్రీను, కోన సత్తిరెడ్డి, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

దివిలి జట్లమ్మ జాతర

పెద్దాపురం: స్థానిక పిఠాపురం రోడ్డులోని దివిలి జట్లమ్మ జాతర గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు నరాలశెట్టి బాబ్జీరావు ఆధ్వర్యంలో వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. చైత్రమాస అమావాస్యను పురస్కరించుకుని జట్లమ్మ అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, హోమాలు, పూజలు నిర్వహించారు. అనంతరం భారీ అన్న సంతర్పణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేఎస్పీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబుతో పాటు దివిలి, చంద్రమాంపల్లి, తాటిపర్తి, తిరుపతి, చదలాడ, పులిమేరు, గోరింట, పిఠాపురం మండలం విరవ గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



జట్లమ్మ గుడి వద్ద భక్తుల కోలాహలం

భక్తి శ్రద్ధలతో నీలమ్మ తల్లి జాతర

సామర్లకోట: స్థానిక నీలమ్మ తల్లి జాతర ఉత్సవం గురువారం రాత్రి భక్తి శ్రద్ధలతో జరిగింది. ఏటా వైశాఖ అమావాస్య రోజున అమ్మవారి సిరి బొమ్మతో ఊరేగింపుగా జాతర నిర్వహిస్తారు. అమ్మవారి విగ్రహం ఉన్న ట్రాక్టర్‌ను పూలు, విద్యుత్ దీపాలతో అలంకరించి ఊరేగించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ యార్లగడ్డ చిన్ని ఉత్సవాలను ప్రారంభించారు. ఆలయ కమిటీ నాయకులు గిడుతూరి శ్రీను, కుప్పాల రమణ, వేల్పుల శ్రీనివాస రావు, తణుకు శ్రీను, మద్దాల వీరబాబు, కంచికట్ల సుబ్బారావులు భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు. జాతరలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ఘనంగా నేరేళ్లమ్మ తీర్థం

కొత్తపల్లి: కొమరగిరి గ్రామ దేవత నేరేళ్లమ్మ తల్లి తీర్థాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, గ్రామంలో గరగ నృత్యాలు నిర్వహించారు. భక్తులు ప్రత్యేక క్యూలో నిలబడి అమ్మవారిని దర్శించుకున్నారు. కొమరగిరి గ్రామం నుంచే కాకుండా, గొర్స, పండూరు, వెంకటరాయపురం, పెదకలవలదొడ్డితో పాటు, పలు గ్రామాల నుంచి భక్తులు అమ్మవారికి చలివిడి, వడపప్పును నైవేద్యంగా సమర్పించారు. ఆలయ నిర్మాణ కర్త కోటగిరి సత్యంబాబు, గ్రామ పెద్దలు కటారి రాజబాబు, రాసంశెట్టి లోవ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

రాపర్తిలో..

పిఠాపురం: మండలంలోని రాపర్తిలో గురువారం స్థానిక గ్రామ దేవత నేరేళ్లమ్మ జాతర మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారి గరగలతో గ్రామోత్సవం నిర్వహించగా, గ్రామ ప్రజలు గరగలకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణ, గరగ నృత్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

స్థలం తగాదాలో ఒకరికి గాయాలు

కరప: ఒక కుటుంబంలో స్థలం విషయంలో తలెత్తిన వివాదంలో ఒక వ్యక్తి గాయపడగా కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసుల కథనం మేరకు.... కరపలోని సీతమ్మ వీధిలో నివాసం ఉంటున్న పెంకే లోవరాజు, శ్రీనివాస్ సోదరుల మధ్య చాలాకాలంగా 10 సెంట్ల ఇంటి స్థలం విషయంలో వివాదం జరుగుతోంది. ఈ క్రమంలో గురువారం స్థలం కోసం సోదరుల మధ్య మరోసారి గొడవ జరిగింది. ఈ తగాదాలో శ్రీనివాస్ భార్య లక్ష్మి కత్తి పీటతో లోవరాజుపై దాడి చేసి, గాయపరచింది. కుటుంబ సభ్యులు క్షతగాత్రుడిని కాకినాడ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, ఏఎస్ఐ వి.సూరిబాబు దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన అవగాహన తరగతులు

కాకినాడ సిటీ: పదో తరగతిలో ప్రవేశించిన విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో మే 21న కాకినాడ యూటీఎఫ్ హోమ్‌లో నిర్వహించిన అవగాహన తరగతులు గురువారం ముగిశాయి. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు పి.గిరిధర్ గోపాల్, సీహెచ్‌వీ రమణ, టి.రవిచక్రవర్తి, కేవీవీ నగేష్, జి.ప్రభాకరవర్మ, కె.సత్తిరాజుల చేతుల మీదుగా ఉపాధ్యాయులకు జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ఫ్యాకల్టీ రమణ మాట్లాడుతూ పదో తరగతి సిలబస్ మారిన నేపథ్యంలో ఈ తరగతులు విద్యార్థులకు బాగా ఉపయోగపడ్డాయన్నారు. వివిధ సబ్జెక్టుల్లో నిపుణులైన ఉపాధ్యాయులు సెలవుల్లో కూడా తమ సమయాన్ని విద్యార్థులకు వినియోగించడం చాలా అభినందనీయమన్నారు. భవిష్యత్తులో కూడా ఈ విధమైన తరగతులు నిర్వహిద్దామన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాకల్టీ ఉపాధ్యాయులు విశ్వేశ్వరావు, పి.ఝాన్సీ, ఎంబీఎస్ దేవి, వి.శ్రీరామారావు, మూర్తి, శ్రీనివాస్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.